క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి



ఇన్‌స్పెక్టర్ రవిని సత్కరిస్తున్న సుందర్‌రెడ్డి

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి అన్నారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఆయనకు శనివారం యాకుత్‌పురా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో కలిశారు. ఇన్‌స్పెక్టర్‌కు సుందర్‌రెడ్డి శాలువా కప్పి పూల మొక్క ఇచ్చి సత్కరించారు. ఐఎస్‌సదన్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

కనకదుర్గ గుడిలో ఎమ్మెల్యే పూజలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీకనకదుర్గ ఆలయంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్, పాలకమండలి, ఆలయ ఈఓ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి కాలనీలో 'కార్డెన్ సెర్చ్'



సోదాల్లో పాల్గొన్న డీసీపీ రూపేష్ తదితరులు

సైదాబాద్: ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేష్ అన్నారు. శనివారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీ గుడిసెల్లో పోలీసులు సోదాలు చేశారు. డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్‌లు సహా 200 మంది పోలీసులు సింగరేణి గుడిసెల్లో జల్లెడ పట్టారు. ఇళ్లన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పత్రాలు సరిగా లేని 35 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, రూ. 5 వేల విలువ చేసే మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో అదనపు డీసీపీ మనోహర్, సైదాబాద్ ఏసీపీ వెంకయ్యనాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఆందోళనకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఎల్‌బీనగర్: తమను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న ఆందోళన శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉదయం నుంచే బైఠాయించారు. తమను పర్మనెంట్ చేసే వరకు ఆందోళన విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. కాగా, ఆందోళన చేస్తున్న కార్మికులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎల్లయ్య మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన కోరికను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, వెంకన్న, మల్లేశం, మనోహర్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి రండి



మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన చైర్మన్ రాజేశ్వరరావు, మోజెస్

సైదాబాద్: నాంపల్లి గృహకల్ప భవన్‌లో ఈనెల 24న జరిగే తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను క్రిస్టియన్ నాయకులు కోరారు. కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన రాజేశ్వరరావు తదితరులు మంత్రిని శనివారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు. క్రిస్టియన్ నాయకులు మేడి ఆనంద్, పోకల అశోక్, ఎంఎస్ రావుపాల్గొన్నారు.

గిరిజన మహిళపై దాడి అమానుషం



బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చంపాపేట: గిరిజన మహిళ వడిత్య లక్ష్మీబాయిపై పోలీసులు దాడిచేసి తీవ్రంగా గాయపర్చడం అమానుష చర్య అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం రాత్రి ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిలతో కలిసి పరామర్శించి ఆమె పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఈ ఘటనపై మంత్రులు కేటీఆర్, సబితా రెడ్డి స్పందించక పోవడం విచారకరమన్నారు. మహిళపై విచక్షణారహితంగా దాడి చేసిన ఎల్‌బీనగర్ పోలీసులందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవటంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. త్వరలో ఈ ఘటనపై మానవహక్కులు, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులకు రూ 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి: వీహెచ్

గిరిజన మహిళపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు డిమాండ్ చేశారు. జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మిని ఆయన పార్టీ నాయకులు కొత్త మనోహర్‌రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ, పార్టీ తరఫున బాధితురాలి కుటుంబ సభ్యులకు త్వరలో రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, అదేవిధంగా దాడికి పాల్పడిన పోలీసులు కూడా రూ 5 లక్షలు అందజేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాస్తారోకోలతో దద్దరిల్లిన కర్మన్‌ఘాట్ చౌరస్తా

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని జీవన్ ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న లక్ష్మిని పరామర్శించిన పలు దళిత, గిరిజన, సేవాలాల్, బంజారా సంఘాల నేతలు సుమారు నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో స్థానికంగా స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక నాయకులు, పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పటంతో ఉద్రిక్తత కాస్తా సద్దుమణిగింది



రాస్తారోకో చేస్తున్న మహిళా సంఘ నేతలు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



5కె రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నేను కచ్చితంగా ఓటు వేస్తాననే నినాదంతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్ స్టేడియం నుంచి చింతలకుంట వరకు నిర్వహించిన 5కె రన్‌లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే, ఇప్పటికే ఓటరు కార్డు ఉన్న వారు అందులో ఏమైన తప్పులుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో 40 నుంచి 49 శాతం మాత్రమే ఓటు నమోదైందని, ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీలు రవీందర్‌కుమార్, దశరథ, అరుణ, అధికారులు జానకీరెడ్డి పాల్గొన్నారు.

ఓటు ఎంతో విలువైంది

మలక్‌పేట: ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 డీసీ జయంత్ అన్నారు. శనివారం మలక్‌పేట ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహిచారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు విలువైందని, తప్పకుండా ఓటు వేయాలని కోరారు. మూసారంబాగ్ చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు కొనసాగిన ర్యాలీలో.. ప్రాజెక్ట్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి, జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



మూసారంబాగ్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీ జయంత్

మహిళపై 'థర్డ్ డిగ్రీ' ఘటనలో ఎస్ఐ బదిలీ

నాగోలు: గిరిజన మహిళ లక్ష్మిపై ఎల్‌బీనగర్ పోలీసుల థర్డ్ డిగ్రీ సంఘటన నేపథ్యంలో ఎల్‌బీనగర్ ఎస్ఐ రవికుమార్‌ను పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు. ఈమేరకు శనివారం రాత్రి రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసిన విషయం విదితమే.

అన్ని కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధి దీపాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత జీహెచ్‌ఎంసీ విద్యుత్ శాఖ అధికారులపై ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం హస్తినాపురం లోని తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ విద్యుత్ డిప్యూటీ ఇంజినీర్ , అసిస్టెంట్ ఇంజినీర్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రతి కాలనీలో అవసరమైన చోట వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలతో పాటు ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా సమస్య ఉందని తెలిస్తే వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈ జగన్నాథం, మహేశ్, బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఫొటో-వీడియో గ్రాఫర్స్

నాగోలు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నాగోల్ ఫొటో-వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాగోలు జైపురికాలనీలో కెమెరా సృష్టికర్త లూయిస్ డగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగోలు ఫొటో-వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. సహదేవ్ మాట్లాడుతూ, జీవితంలో గత స్మృతులను నెమరువేసుకోవడం ఫొటోలతోనే సాధ్యమన్నారు. అందమైన జ్ఞాపకాలను పది కాలాలు పదిలంగా ఉంచేదే ఫొటో అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి కిషన్, కార్యవర్గ సభ్యులు సుధాకర్, మహేష్, దనరాజ్, శ్రీశైలం, కరుణాకర్, రాజు పాల్గొనడం జరిగింది.

తాము మరణిస్తూ.. పలువురికి ప్రాణం పోశారు!


● కామినేనిలో ఇద్దరు అవయవదానం



రాజు (ఫైల్)

మన్సూరాబాద్: తాము మరణిస్తూ పలువురి జీవితాల్లో వెలుగులు నింపారు ఇద్దరు వ్యక్తులు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ శాంతినగర్‌కాలనీకి చెందిన ఓర్సు రాజు(41) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 13 రాత్రి 8.45 గంటలకు హాజీపేట వద్ద రోడ్డు ప్రమాదానికి గురికాగా, వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అదే రోజు రాత్రి ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న రాజు 18న సాయంత్రం 5 గంటలకు బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. అవయవ దానంపై రాజు తండ్రి నర్సింహ, భార్య వాసంతిలకు అవగాహన కల్పించగా, వారు రాజు కిడ్నీని కామినేని హాస్పిటల్‌కు దానం చేశారు.

మరో ఘటనలో...



రాజశేఖర్ (ఫైల్)

ఉమ్మడి నల్లగొండ జిల్లా పోచంపల్లికి చెందిన ఉలిపే రాజశేఖర్ (26) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 15న రాత్రి ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న రాజశేఖర్ 17 సాయంత్రం బ్రెయిన్‌డెడ్ అయినట్లు కామినేని వైద్యులు ప్రకటించారు. అవయవదానంపై అతడి భార్య రేణుక, తండ్రి కృష్ణలకు అవగాహన కల్పించారు. దీంతో వారు రాజశేఖర్ ఊపిరితిత్తులను సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు, లివర్‌ను కామినేని హాస్పిటల్‌కు, కార్నియాలను సరోజిని కంటి ఆసుపత్రికి దానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన అన్నారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై మంచి ఆలోచనతో ముందుకు రావాలని ఆమె సూచించారు. విద్యార్థులందరూ తెలివైన వారేనని, వారందరినీ ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఒకరితో ఒకరిని పోల్చవద్దని, భవిష్యత్‌లో వారు కూడా ఉన్నత పౌరులుగా ఎదుగుతారన్నారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా దేవసేన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే



సెంట్రల్‌బ్యాంక్ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో రూ.12 కోట్లతో వివిధ కాలనీల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి కాలనీపై స్పష్టమైన అవగహన ఉందని, ప్రణాళికబద్ధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించానని అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. హయత్‌నగర్‌లోని లక్ష్మీ భవానీనగర్ కాలనీలో డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ ట్రంక్‌లైన్‌తో సమీప కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, కాలనీవాసులు జక్కిడి తిరుమల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రుద్ర యాదగిరి, ఆనందం, వెంకటేష్, జగత్‌రెడ్డి, సాంబిరెడ్డి, నాయకులు నాగరాజు, జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి

చంపాపేట: విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ మురళీమోహన్ అన్నారు. చంపాపేట చౌరస్తాలోని రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కాస్మోస్–2023 వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన మిస్సైల్స్, బహుళార్థక సాధక ప్రాజెక్టులు, అగ్నిపర్వతాలు వంటి నమూనాలు ఆహూతులను ఆలోచింపజేశాయి. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ రాణి, జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, దయాకర్, పూర్ణిమ, ఏజీఎం సతీష్, ప్రిన్సిపాల్ ప్రీతి పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష ఆదరణ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, బెడ్‌షీట్స్ ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, హైదరాబాద్ ముత్యాలు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందన్నారు.



ఆలిండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాలో కొనుగోలుదారుల సందడి

నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలి: బీజేవైఎం



డీటీకి వినతి పత్రం సమర్పిస్తున్న శివచంద్రగిరి, దినేష్ గౌలీకర్

సైదాబాద్: తెలంగాణ యువతకు ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతిని చెల్లించాలని బీజేపీ యువమోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు శివచంద్రగిరి, యువమోర్చా నేషనల్ కో ఆర్డినేటర్ మెంబర్ దినేష్ గౌలీకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు యువమోర్చా నాయకులతో కలిసి శనివారం సైదాబాద్ మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణరాజుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నిరుద్యోగ భృతి అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచి గెలిచిన తర్వాత కూడా 56 నెలలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, దళితబంధు, గిరిజనబంధు, బీసీబంధు వంటి పథకాలను ప్రభుత్వం కేవలం బీఆర్‌ఎస్ నాయకులు చెప్పినవారికే ఇస్తూ నిజమైన అర్హులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో యువమోర్చా నాయకులు భరత్, జగన్, రాజేష్, ఈశ్వర్, శివ, హరి పాల్గొన్నారు.

చైతన్యపురి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ అవినాష్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షుడు అనిల్ రాకేష్, సాయి, ఈశ్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ శ్యామ్‌సుందర్, పక్కన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

మలక్‌పేట: ప్రైవేట్ హాస్టళ్లలో భద్రత కోసం తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్ అన్నారు. మలక్‌పేట పరిధిలోని ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాకులతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశానికి ఏసీపీ హాజరయ్యారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వ్యక్తుల పూర్తి చిరునామా తీసుకుని హాస్టళ్లలో చేర్చుకోవాలని, హాస్టళ్లకు వచ్చి, పోయే వారి వివరాలు ప్రతి రోజూ నమోదు చేయాలన్నారు. కొత్తగా వచ్చే వారిపై నిఘా ఉంచాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని కోరారు. రాత్రి 10 గంటల తర్వాత హాస్టల్ తెరిచి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్, డీఐ జయరామ్, ఎస్సైలు జయంత్, నవీన్, కిరణ్‌లాల్, జ్యోతి , సిబ్బంది పాల్గొన్నారు.

నగల కోసం పెద్దమ్మ ప్రాణం తీశాడు!

నిందితుడి అరెస్టు, సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భీంరెడ్డి

హస్తినాపురం: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి పెద్దమ్మ నగలపై కన్నేశాడు. ఆమెను హత్య చేసి నగలు కాజేశాడు. నిందితుడిని మీర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం వనస్థలిపురం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ భీంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మీర్‌పేట లెనిన్‌నగర్‌లో లక్ష్మయ్య, బొజ్జమ్మ (58) దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త స్థానిక ఇండో- అమెరికా స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బొజ్జమ్మ చెల్లెలు కొడుకు ఆంజనేయులు (40) మద్యానికి బానిసై భార్యను వదిలేశాడు. పది రోజులుగా పెద్దమ్మ ఇంట్లోనే ఉంటున్న అతను ఆమె మెడలో ఉన్న 8 గ్రాముల బంగారు పుస్తెలతాడు, కాళ్లకు ఉన్న 60 తులాల వెండి కడియాలను కాజేయాలని పథకం వేశాడు. ఈనెల 17న ఇంట్లో ఒంటరిగా ఉన్న బొజ్జమ్మను సుత్తితో తలపై మోది హత్య చేశాడు. ఆభరణాలను తీసుకొని, ఆ తర్వాత ఆమె ఒంటిపై చీరను వేసి కాల్చి పారిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆంజనేయులుపై అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. అతడిని అరెస్ట్ చేసి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో మీర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, డీఐ నాయుడు పాల్గొన్నారు. హత్య జరిగిన 48 గంటల్లోపే నిందితుడిని పట్టుకున్న మీర్‌పేట పోలీసులను ఏసీపీ అభినందించారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

సైదాబాద్: భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...జటావత్ రేణుక, మేగావత్ దత్తు (27) దంపతులు గ్రీన్‌పార్క్ కాలనీలో నివాసముంటున్నారు. రేణుక నర్సుగా పని చేస్తుండగా, దత్తు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో దత్తు కోపంగా భార్య మెడలోని తాళిబొట్టును గుంజుకొని తన బైక్‌పై వెళ్లిపోయాడు. రేణుక అతడికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వస్తోంది. బంధు, మిత్రులను వాకబు చేసినా దత్తు ఆచూకీ తెలియరాకపోవడంతో శుక్రవారం సైదాబాద్ పోలీసులకు రేణుక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.